క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు ఈ నెల 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్, మెకానిక్, వెల్డర్, కోపా, డ్రెస్ మేకింగ్ విభాగాల్లో సీట్లు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 75690 62449, 93900 63881 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఉపకారవేతనానికి విద్యార్థిని ఎంపిక



భామిని: మండలంలోని నేరడి – బి ఎంపీయూపీ పాఠశాలకు చెందిన విద్యార్థిని వలరౌతు వందన ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికై నందని హెచ్‌ఎం కె. శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నాలుగేళ్ల ఏడాదికి రూ. 14 వేల వంతున ఉపకార వేతనం మంజూరవుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థినిని పలువురు అభినందించారు.

బీజేపీ, జనసేన అభిమానుల ర్యాలీ



బత్తిలి వీధుల్లో బైక్ ర్యాలీ

భామిని: ఒడిశాలో బీజేపీ, ఆంధ్రాలో కూటమి అధికారంలోకి రావడంతో బీజేపీ, జనసేన పార్టీ అభిమానులు గురువారం పలు గ్రామాల్లో బైక్ ర్యాలీ చేపట్టారు. మండల సరిహద్దు గ్రామమైన బత్తిలి, ఒడిశాకి చెందిన సింగ్‌బై, బాసన్నగూడ, జగన్నాథపురం, చింతలగూడలలో ఒడిశాకు చెందిన బీజేపీ అభిమానులు, ఆంధ్రా జనసేన అభిమానులు బైక్ ర్యాలీ స్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో రుంకు కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కేంద్ర బృందాల పర్యటన

పాలకొండ రూరల్: ప్రిజమ్–10 కార్యక్రమం అమలులో భాగంగా శుక్రవారం నుంచి పాలకొండ నియోజకవర్గంలో కేంద్ర బృందాలు పర్యటించనున్నట్టు ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ తెలిపారు. ప్రిజమ్‌లో భాగస్వామ్యమైన క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది తమ పరిధిలో ఇదివరకే గుర్తించిన గర్భిణులు, బాలింతలు, రక్తహీనత, పౌష్టికాహార లోపంలో ఇబ్బందులు పడుతున్న వారి తాజా ఆరోగ్య పరిస్థితులు, పురోగతిపై సమగ్ర సమాచారంతో ఉండాలన్నారు. ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు బృందాల ఆకస్మిక సందర్శనలు ఉంటాయన్నారు. ఈ మేరకు అన్నవరం, ఎం.సింగుపురం పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ, ఐసీడీఎస్ తదితర అధికారులకు పలు సూచనలు చేశారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఎత్తివేత

సీతానగరం: 2024 సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని కేంద్ర ఎన్నికల కమిషన్ విధించిన ఎన్నికల ప్రవర్తనా నియమా వళిని ఎత్తివేసినట్లు ఎంసీసీ(ఎంపీడీఓ) ఎం.ఈశ్వరరావు గురువారం తెలియజేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ 2024 లోక్‌సభ, శాసనసభ ఎన్నికల సందర్భంగా ఎన్నికల నయమావళి అమలులోకి వచ్చిందన్నారు. ఎన్నికల ఫలితాల ప్రకటన ప్రక్రియ ముగియడంతో ప్రవర్తనా నియమావళి ఎత్తివేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ కార్యలయం నుంచి గురువారం ఉత్తర్వులు వచ్చాయని తెలియజేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఎత్తి వేయడంతో అభివృద్ధి పనులు, అసంపూర్తిగా ఉన్న పనులు చేపట్టడానికి ఇకపై ఎటువంటి ఆటంకాలు ఉండవన్నారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేకాలంకరణ

సీతానగరం: మండల కేంద్రంలో సువర్ణముఖినది తీరాన వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసిన లక్ష్మీనృసింహ స్వామివారిని గురువారం ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి దర్శనానికి భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు వేకువ జామునుంచి స్వామివారిని వివిధరకాల పూలు, భక్తులు సమకూర్చిన పూలతో ఉదయం 5 గంటల సమయానికి ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారిని దర్శించుకునేందుకు దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అందజేశారు.

10న ఆలయ భూముల కౌలు వేలం

సాలూరు: పెదకోమటిపేట సీతారామస్వామి దేవస్థానానికి చెందిన, పాచిపెంట మండలంలోని పి.కోనవలసలో గల భూముల కౌలుకు ఈ నెల 10న టెండర్ కమ్ బహిరంగ వేలం వేయనున్నట్లు గ్రూప్ దేవాలయాల కార్య నిర్వాహక అధికారి ఓ ప్రకటనలో తెలిపారు. పి.కోనవలసలో గల 70/1.2, 79/1,99, 452/2.7 సర్వే నంబర్లలో సుమారు 6.53 ఎకరాల విస్తీర్ణం భూములకు ఈ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ నెల 10న ఉదయం 10 గంటలకు పట్టణంలోని సీతారామస్వామి దేవస్థానం, పెదకోమటిపేట వద్ద వేలం పాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9381939889 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

దోమ కాటు ఆరోగ్యానికి చేటు ..

- దోమల వల్ల ప్రబలుతున్న వ్యాధులు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



ఈ తరహా ప్రదేశాలే దోమలకు ఆవాసాలు

పాలకొండ రూరల్: మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పట్టణాలు, గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంటోంది. ఇది మురుగుమయమై దోమలకు ఆవాసంగా మారుతోంది. దోమల దాడితో పాటు మారిన వాతావరణ పరిస్థితులు, పరిశుభ్రత లోపించిన పరిసరాల వల్ల, కలుషిత నీరు తాగడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఈ తరుణంలో దోమల వల్ల కలిగే అనర్థాలు, వచ్చే జబ్బులు, వాటి లక్షణాలపై అవగాహన పెంచుకోవాలని పాలకొండ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జి.నాగభూషణరావు సూచిస్తున్నారు.

● మలేరియా వ్యాధి లక్షణాలు...

అనాఫిలిస్ అనే దోమ కాటు వల్ల మలేరియా జ్వరం వ్యాపిస్తుంది. నిల్వ ఉన్న నీటితో పాటు తాగునీటిలో కూడా ఈ దోమ వృద్ధి చెందుతుంది. ఈ దోమ వల్ల వచ్చిన జ్వరం 10 నుంచి 14 రోజుల పాటు ఉండి వాంతులు కూడా అవుతుంటాయి.

● డెంగీ లక్షణాలు..

సాధారణంగా ఇంటి లోపల, బయట నిల్వ ఉన్న నీటిలో డెంగీ దోమ గుడ్లు పెడుతుంది. ఈ వ్యాధి సోకితే 15 రోజుల పాటు జ్వరం ఉధృతంగా ఉంటుంది. తలనొప్పి, నొసటిపై, కంటి లోపల నొప్పితో రోగి చాలా బాధపడుతాడు. కడుపు నొప్పి కూడా వస్తూ ఉంటుంది.

● చికున్ గున్యా లక్షణాలు..

ఈడిస్ దోమ ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. చిన్నగా, నల్లగా ఉండే ఈ దోమపై తెల్లని మచ్చలుంటాయి. ఈ వ్యాధి బారిన పడిన రోగికి 10 నుంచి 14 రోజుల పాటు తీవ్ర నొప్పులతో కూడిన జ్వరం ఉంటుంది. జ్వరం తగ్గినా మరో 10 రోజుల పాటు తీవ్రంగా ఒళ్లు నొప్పులు ఉంటాయి.

● మెదడువాపు వ్యాధి లక్షణాలు...

మెదడువాపు వ్యాధి ప్రాణంతకమైనది. క్యూలెక్స్ దోమ వల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఈ దోమ ఎక్కువ రోజుల పాటు మురుగునీటి నిల్వల్లో పెరుగుతుంది. 14 రోజుల పాటు తీవ్రమైన జ్వరంతో బాధపడుతుంటారు. ఈ జ్వరం తీవ్ర మైతే బ్రెయిన్ డెడ్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. సాధారణంగా ఈ జ్వరం రెండు నుంచి 14 ఏళ్ల పిల్లల్లో ఎక్కువగా వ్యాపిస్తుంది.



చిన్నారికి వైద్యం చేస్తున్న చిన్నపిల్లల వైద్య నిపుణుడు రవీంద్రనాథ్

రక్షణ పొందాలి

ఇటీవల కాలంలో అక్కడక్కడ వైరల్ ఫీవర్లు నమోదవుతున్నాయి. దోమల దాడి నుంచి రక్షణ పొందాలి. వైరల్ ఫీవర్ వస్తే మందులు వాడితే తగ్గుతుంది. అలా కాకుండా జలుబు, తలనొప్పి, వాంతులు, ఒంటిపై దద్దుర్లు వంటి లక్షణాలు ఉంటే తక్షణమే వైద్యులను సంప్రదించి అవసరమైన వైద్యం పొందాలి. అజాగ్రత్తగా ఉంటే వ్యాధి తీవ్రత పెరిగే అవకాశం ఉంటుంది. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో రోగకారకాలను అధిగమించవచ్చని గుర్తించాలి. – **జి.నాగభూషణరావు, పాలకొండ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్**

దోమల నియంత్రణకు చర్యలు.....

- మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలి.
- మురుగు కాలువల్లో నీరు సక్రమంగా పారేలా చేయాలి.
- పరిసర ప్రాంతాల్లో కంప చెట్లు, పిచ్చిమొక్కలు తొలగించుకోవాలి.
- ఇళ్ల మధ్య గోతుల్లో మురుగు నిల్వ లేకుండా చూసుకోవాలి.
- అన్ని రకాల నీటి నిల్వల్లో వారానికి ఒకసారి దోమల నియంత్రణ మందు వేయాలి.
- దోమలు కుట్టకుండా దోమ తెరలు, ఇతరత్రా విధానాలు అవలంభించాలి.
- దోమల నియంత్రణకు తరచూ ఫాగింగ్ చేయాలి.

వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో నిమగ్నమైన విద్యార్థులు

పాలకొండ రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు కె.జనార్దనరావు నేతృత్వంలో ఈ పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ జిల్లా కార్యదర్శి బి.కుమార్, గ్రేడ్–1 గ్రంథాలయ అధికారి వీవీవీజీ శంకర్ పాల్గొని పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం ఉపాధ్యాయుడు మురళి నేతృత్వంలో ఖోఖో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో బి.గణేష్‌బాబు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



మరకత లింగేశ్వర ఆలయంలో శని జయంతి పూజల్లో పాల్గొన్న భక్తులు

పాలకొండ రూరల్: శనీశ్వరుడి జయంతిని పురస్కరించుకుని భక్తులు శివాలయాలకు గురువారం పోటెత్తారు. స్థానిక నక్కలపేట మరకత లింగేశ్వరుని ఆలయంలో శని జయంతి పూజలు, శాంతి పూజలు చేపట్టారు. అర్చకులు పర్రి శరత్‌కుమార్ నేతృత్వంలో పెద్దెత్తున భక్తులు శని దేవతార్చాన పూజలు చేయడంతో దానాలు చేశారు.

సన్మార్గంలో నడుచుకోవాలి

పాలకొండ: ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడుచుకోవాలని సత్యసాయి భక్తుడు ఎన్‌వీ రమణ అన్నారు. మండలంలోని పనుకువలస గ్రామంలో గురువారం దివ్యజ్ఞాన భోదన సత్సంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాటి మనిషిపై జాలి, దయ కలిగి ఉండాలని తెలిపారు. ప్రతి వ్యక్తిలో మంచిని చూడ గలిగితే అంతా మంచిగా జరుగుతుందన్నారు.

రాయితీ విత్తనాలు సద్వినియోగపరుచుకోవాలి

పాలకొండ రూరల్: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతుభరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్న రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ ఎన్ని వాహని సూచించారు. మండలంలోని సింగన్నవలస, వెలగవాడ ఆర్‌బీకేలను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అవసరమైన విత్తనాలు తీసుకుని సాగు చేపట్టాలన్నారు. సలహాలు, సూచనలకు వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు.

అప్రమత్తంగా వ్యవహరించాలి

పాలకొండ రూరల్: వర్షాకాల సీజన్‌లో విజృంభించే వ్యాధులపై అవగాహన పెంచుకుని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.రవికుమార్ అన్నారు. గ్రామాల్లో అవగాహన కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఎం. సింగుపురం, తదితర గ్రామాల్లో గురువారం అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు పౌష్టికాహార ఆవశ్యకతను వివరించారు.

తొలకరిలో పశువులు జతకు వస్తే గుర్తించాలి

సీతానగరం: తొలకరి కాలంలో చల్లదనం కావడం వల్ల పశువులు జతకు వస్తాయని, జతకు వచ్చినట్లు గుర్తించిన రైతులు పశువైద్య సిబ్బంది ద్వారా సూది మందు వేయించాలని పశువైద్యశాఖ సీతానగరం సబ్‌డివిజన్ ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్ అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని బుడ్డిపేట, పెదభోగిలి గ్రామాల్లో గురువారం జతకువస్తాయన్న పశువులు, అనారోగ్యంతో ఉన్న పాడి పశువులకు సిబ్బంది సహకారంతో తనిఖీ చేసి వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో గల బలిజిపేట, సీతానగరం మండలాల్లో 24వేల 200 పాడిపశువులున్నాయ ని, పాల వ్యాపారాలపై రైతులు ఆసక్తి చూపడం వల్ల ప్రత్యేకించి ప్రతి ఒక్కరూ గేదెజాతి, ఆవుజాతి పాడి పశువులను పెంచుతున్నారన్నారు. వేసవికాలంలో ఎండలు తీవ్రత కారణంగా వేడిని తట్టుకోలేక పశువులు యదకు రావడం తక్కువని, ఒకవేళ యదకు వచ్చినా చూడి నిలబడడం కష్టమేనన్నారు. తాజాగా వాతావరణం చల్లబడడం వల్ల ఎక్కువగా పశు వులు యదకు వస్తాయన్నారు. యదకు వచ్చిన పశువులకు సమీపంలో ఉన్న పశువైద్య సహాయకులతో సూది మందు 10 గంటల్లోగా వేయించా లని సూచించారు. రైతులు విధిగా జతకు వచ్చిన పశువులకు పచ్చి గడ్డితో పాటు పోషక విలువలతో కూడిన ఆహారం మిశ్రమదాణా, మినరల్ మిక్సర్ విధిగా ఇవ్వాలని చెప్పారు. యదకు సంబంధించిన సూదిమందు వేసినప్పటికీ యద నిలబడకపోతే సమీపంలో ఉన్న పశు వైద్యాధికారుల సహకారంతో వైద్యసేవలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

నారు దశలో జాగ్రత్తలే పంటకు రక్ష

- నారుమడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి
- నాణ్యమైన దిగుబడులకు ఆస్కారం : వ్యవసాయ శాఖ సూచన



మండల వ్యవసాయ శాఖాధికారి అశోక్

పార్వతీపురంటౌన్: వరినారు పోసే రైతులు కొన్ని జాగ్రత్తలు పాటించి నారుమళ్లను పోసుకుంటే నాణ్యమైన నారు, దిగుబడిని పొందవచ్చు. నారుమడి యాజమాన్య పద్ధతులను పార్వతీపురం వ్యవసాయ అధికారి అశోక్ ఇలా సూచిస్తున్నారు.

● నారుమడి తయారీ ఇలా..

దమ్ము చేసిన నేలలో 10మీటర్ల పొడవు, ఒక మీటరు వెడల్పుతో నారుమడిని చేసుకోవాలి. నారుమడిలోని నీరు, పోషకాలు బయటకు పోకుండా గట్లు వేసుకోవాలి. గట్లు సమంగా, గట్టిగా పోయాలి. మడిలో చెత్తాచెదారం లేకుండా జాగ్రత్త పడాలి. నారుమడి బురద పదునులో ఉండాలి. నారుమడులు ఎత్తుగా ఉండేలా జాగ్రత్త పడాలి. రెండు మడుల మధ్యలో 20 సెంటీమీటర్ల వెడల్పులో కాలువ తీయాలి. కాలువలోని మట్టిని తీసి మడిలో వేసే నారుమడిని ఎత్తుగా చేసుకోవాలి. నారుమడి మొత్తం చదునుగా ఉం డాలి. నారుమడి 10 నుంచి 12రోజుల ముందే దమ్ము చేసి చదును చేసుకోవాలి. నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేసుకోవాలి. మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు 5కిలోల చొప్పున చల్లుకోవాలి. నారు పూర్తిగా పురి విప్పుకునే వరకు ఆరు తడులు ఇచ్చి.. తర్వాత పల్చగా నీరు నిల్వ కట్టాలి. జింకు లోపాన్ని గమనించి 2గ్రాముల జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతా ల్లోనే జింకు లోప లక్షణాలు ఎక్కువగా కనబడతాయి. తల్లి పురుగు గుడ్లను కొసల మీద పెడుతుంది. నారు నాటేటప్పుడు కొసలు విరిచి నాటాలి. దీంతో గుడ్లను నిర్మూలించవచ్చు.

● విత్తన మోతాదు ఇలా..

నాటే పద్ధతికి 20నుంచి 25 కిలోలు వెదజల్లడానికి విత్తనాలను వినియోగించవచ్చు. సాధారణ భూముల్లో 24నుంచి 30కిలోలను వాడవచ్చు. సహజంగా వెదజల్లడానికి 16నుంచి 30కిలోలు సరిపోతాయి. విత్తడానికి (వర్షాధారపు వరి)కి సంబంధించి 30నుంచి 36కిలోల అవసరం ఉంటుంది.

● విత్తన శుద్ధి ఇలా..

కిలో విత్తనానికి 2.5గ్రాముల కార్బండిజమ్ కలిపి 24గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవాలి. దంప నారుమళ్లకైతే లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజమ్ కలపాలి. ఆ ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నాన బెట్టాలి. మరో 24 గంటల పాటు మండీకట్టి మొలకలను దంప నారుమడిలో చల్లుకోవాలి. కిలో విత్తనాలు నానబెట్టడానికి లీటరు నీరు సరిపోతుంది. పది లీటర్ల నీటికి 1.5 కిలోల ఉప్పు కలపగా వచ్చిన ద్రావణంలో ఎంపిక చేసుకున్న విత్తనాన్ని పోసి పైకి తేలిన విత్తనాలను తొలగించాలి. ఉప్పు నీటిలో మునిగిన గట్టి విత్తనాలను నారు పోయడానికి వాడుకోవాలి. మడిలో చల్లే ముందు 24 గంటల పాటు మంచినీటిలో విత్తనాలను నానబెట్టాలి. విత్తనాల ద్వారా సంక్రమించే తెగుళ్ల నివారణ కోసం కిలో విత్తనానికి 3గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ మందును కలిపి విత్తనశుద్ధి చేయాలి. నారుమడిలో చల్లే విత్తనాలు ముందు మొలకెత్తిన విత్తనాన్ని 0.2శాతం క్లోరిపైరిపాస్ ద్రావణంలో నానబెట్టి చల్లుకోవాలి. దీని వల్ల నారుమడిలో ఆకు తినే పురుగులు, ఉల్లికోడు, మొవ్వపురుగు ఆశించకుండా ఉంటాయి.

● సస్యరక్షణ ఇలా..

విత్తిన 10రోజులకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు సెంటు నారుమడికి 160గ్రాముల చొప్పున వేయాలి. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లేదా క్లోరిపైరిఫాస్ 2.0మిల్లీ లీటర్లను లీటరు నీటికి కలిపి విత్తనాలపై 10రోజుల నుంచి 17రోజుల వరకు పిచికారీ చేయాలి. లేదా నారు తీయడానికి వారం రోజులముందు సెంటు నారుమడికి 160గ్రాముల కార్బో ఫ్యూరాన్ గుళికలు తక్కువ నీటిలో వేయాలి.

● ఎరువుల యాజమాన్యం ఇలా..

నారుమడులు పోయాలనుకున్న భూములకు వేసవి దుక్కుకు ముందుగానే పశువుల ఎరువును వేయాలి. నారుమడులు పోయడానికి పొలంలో 10వభాగాన్ని ఎంపిక చేసుకోవాలి. ఎంపిక చేసుకున్న పొలానికి నీరు పెట్టి బాగా కలియదున్నాలి. తర్వాత మట్టి గడ్డలన్నీ మెత్తగా అయ్యేలా బాగా దమ్ము చేయాలి. మొక్కలు లేకుండా జాగ్రత్తపడాలి. 5సెంట్ల నారుమడికి 2కిలోల నత్రజనిని ఒక కిలో విత్తనం చల్లే ముందు మరో కిలో విత్తిన 12వ నుంచి 14రోజులకు ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్ ఇచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భాస్వరం రెట్టింపు చేసుకోవచ్చని వివరించారు.

గైసిల్ పత్తి విత్తనాలు అమ్మరాదు..

- వ్యవసాయ శాఖ ఏడీఏ రత్నకుమారి



రైతులకు విత్తనాలు అందిస్తున్న ఏడీఏ రత్నకుమారి, ఎంఏఓ మన్మథరావు

భామిని: భూసారంతో పాటు రైతు ఆరోగ్యాన్ని హరించే గైసిల్ పత్తి విత్తనాలను (గడ్డి విత్తనాలు) విక్రయించరాదని వ్యవసాయ శాఖ పాలకొండ డివిజన్ సహాయ సంచాయలకురాలు కె. రత్నకుమారి అన్నారు. గురువారం స్థానిక ఆర్‌బీకేలో ఏఓ కిమిడి మన్మధరావు ఆధ్వర్యంలో డీలర్లు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నాణ్యత గల బీటీ విత్తనాలు మాత్రమే వేసుకోవాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 16 ఆర్‌బీకేల పరిధిలో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ప్రస్తుతం 1061 రకం–1061 క్వింటాళ్లు.. ఎంటీయూ రకం–64 క్వింటాళ్లు.. బీపీటీ 5204 రకం–28 క్వింటాళ్లు.. ఆర్‌జీఎల్ 2537 రకం–170.5 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటితో పాటు పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగు– 42 క్వింటాళ్లు, తట్టెలు–2 క్వింటాళ్లు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అనంతరం పలువురు రైతులకు విత్తనాలు అందజేశారు.

సామరస్యంగా వ్యవహరించాలి



నవగాం వద్ద ప్రజలకు సూచనలు చేస్తున్న ఎస్సై ప్రశాంత్‌కుమార్

పాలకొండ రూరల్: ఎన్నికల ప్రక్రియతో పాటు లెక్కింపు పూర్తయిన నేపథ్యంలో ఇకపై ప్రతి ఒక్కరూ సామరస్యంగా వ్యవహరించాలని ఎస్సై ఎస్. ప్రశాంత్‌కుమార్ సూచించారు. మండలంలోని నవగాం, టీడీ.పారాపురం, బెజ్జి, తదితర గ్రామాల్లో తన సిబ్బందితో కలిసి గురువారం పర్యటించారు. అక్కడి ప్రజలతో మాట్లాడుతూ, సామరస్యపూర్వక వాతావరణంలో మెలగాలన్నారు. హద్దు మీరితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పట్టణ పరిధిలో పెద్దకాపు వీధి, పరిసర ప్రాంతాల యువతకు పలు సూచనలు చేశారు.

ముగిసిన అఖండ సాయినామ సప్తాహం

గరుగుబిల్లి: స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలో మే 30వ తేదీ నుంచి నిర్వహిస్తున్న 18వ అఖండ సాయినామ సప్తాహం కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఉదయం సుప్రభాతసేవ తదితర పూజా కార్యక్రమాల అనంతరం బాబా విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.



షిర్డీసాయిబాబా విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

వైద్యసేవలను వినియోగించుకోండి



రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు సంతోష్‌కుమార్

గరుగుబిల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాల ద్వారా అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు సంతోష్‌కుమార్ కోరారు. మండలంలోని చినగుడబ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. హైరిస్క్ గర్భిణులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆరోగ్య తనిఖీలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

103 మందికి నేత్ర పరీక్షలు



నేత్ర పరీక్షలు చేస్తున్న డాక్టర్ అలేఖ్య

వీరఘట్టం: మండలంలోని చిట్టపులివలస జంక్షన్‌లో ఉన్న సత్యసాయి నిత్య అన్నదానం సత్రంలో గురువారం నిర్వహించిన ఉచిత నేత్ర శిబిరంలో డాక్టర్ అలేఖ్య, సిబ్బంది 103 మందికి నేత్ర పరీక్షలు నిర్వహిచారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 77 మందిని క్యాటరాక్ట్ ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు క్యాంపు కో–ఆర్డినేటర్ వెంకటరమణ తెలిపారు.

ఆరోగ్యంపై అవగాహన కల్పించండి



సూచనలిస్తున్న ఎంపీడీవో మల్లిఖార్జునరావు

కొమరాడ:

ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని, ఆ దిశగా వైద్యారోగ్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో మల్లిఖార్జునరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్యారోగ్య అధికారులతో గురువారం సమావేశమైన ఆయన.. గ్రామాల్లోని గర్భిణులు, బాలింతలు, ఎనీమియాతో బాధపడుతున్న వారికి, దీర్ఘకాలిక రోగులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య తనిఖీలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేయాలన్నారు. ఇంటింటా ఫీవర్ సర్వే చేసి, గ్రామీణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాశాఖ అధికారి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల సీట్ల భర్తీకి లాటరీ



లాటరీ ద్వారా సీట్లు భర్తీ చేస్తున్న అధికారులు

సీతంపేట: సీతంపేట, కొత్తూరు మినీ గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి గురువారం స్థానిక ఏపీఆర్ బాలుర గిరిజన పాఠశాలలో లాటరీ నిర్వహించారు. ఒకటో తరగతిలో 76, 2వ తరగతిలో 18, 5వ తరగతిలో 5, ఆరు, ఏడు తరగతుల్లో 3 చొప్పున మొత్తం 105 సీట్లు భర్తీ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డీడీ అప్పన్నదొర, డిప్యూటీ ఈఓ పాలక నారాయుడు, గురుకులం సెల్ ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు, కన్వీనర్, ప్రిన్సిపాల్ అజిత్‌కుమార్, మినీ గురుకులం ఇన్‌చార్జులు హేమలత, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కురుపాం: స్థానిక ఆదర్శ పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వి.రామలక్ష్మి తెలిపారు. ఇదే విషయమై విలేకరులతో గురువారం మాట్లాడిన ఆమె.. 7, 8, 9 తరగతుల్లో మిగిలిపోయిన సీట్లు కోసం ఈ నెల 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఈ నెల 13వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించి, ఎంపికైన వారికి అడ్మిషన్‌లు ఇస్తామన్నారు.